క్లుప్తంగా

గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ



జేసీ నవ్యకు బొకే అందజేస్తున్న కార్యదర్శి ప్రకాష్

కర్నూలు కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ పర్సన్ ఇన్‌చార్జ్ జేసీని మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

నిరుపేదలకు పండ్లు, కూరగాయలు పంపిణీ



పేదలకు పండ్లు, కూరగాయల కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో నిరుపేదలకు పండ్లు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు సమాజంలోని నిరుపేదల ఆరోగ్యం, అభివృద్ధి కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సమాజంలో ఎంతో మంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, వారిని ఆదుకోవాలన్నారు.

మైనింగ్ అధికారుల వేధింపులు ఆపాలి

కర్నూలు(సెంట్రల్): నెల రోజుల క్రితం మైనింగ్ అధికారులు తన ట్రాక్టర్‌ను పట్టుకొని అక్రమంగా సీజ్ చేశారని, దానిని తనకు అప్పగించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని అస్లాం బాషా అనే ట్రాక్టర్ యాజమాని కుటుంబ సభ్యులతో కలసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ట్రాక్టరే తనకు జీవనాధారమని, దాన్ని అధికారులు సీజ్ చేయడంతో పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. ట్రాక్టర్‌కు సంబంధించి ఏదైనా పెనాల్టీ వేస్తే చెల్లిస్తానని చెప్పినా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తన ట్రాక్టర్‌ను వెంటనే విడిచిపెట్టకపోతే మైనింగ్ కార్యాలయం ఎదుట దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు.

ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడిగా ప్రతాప్

కర్నూలు(సెంట్రల్): ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడిగా రేపల్లె ప్రతాప్ నియమితులయ్యారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కమిటీ అధ్యక్షుడిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాష, మాజీ ఎమ్మెల్సీ సుధాకర బాబు హాజరయ్యారు.

మే డేను జయప్రదం చేయాలి

కర్నూలు(సెంట్రల్): మే డే వేడుకలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు ఏఐటీయూసీ కార్యాలయంలో నగర కమిటీ జనరల్ బాడీ సమావేశాన్ని నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. 44 కార్మిక చట్టాల స్థానంలో ప్రధాని మోదీ 4 లేబర్‌కోడ్‌లను తెచ్చారని, 8 గంటల పనిస్థానంలో 12 గంటల విధానాన్ని తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఆటో, హమాలీ, కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తానని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, కోటమ్మ మద్దిలేటి, బాబు,లాలు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : మ్యాడ్ స్క్వేర్, మైన్‌క్రాఫ్ట్ మూవీ, రాబిన్‌హుడ్, వీర ధీర షూర 2, ఆర్య2 (2009), సికందర్, ఎల్2 ఎంపురాన్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, వీర ధీర షూర 2, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, 28 డిగ్రీ సెల్సియస్, శారీ, లవ్ యువర్ ఫాదర్, ఎల్2: ఎంపురాన్, సికందర్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ
శ్రీరామ : ఆదిత్య 369 (1991), వృషభ
రాజ్ : ఆర్య2(2009)
భరత్ కాంప్లెక్స్ : శివాజ్ఞ
విజయ థియేటర్ : మ్యాడ్ స్క్వేర్
విక్టరీ టాకీస్ : వీర ధీర షూర 2

దళారుల ఏరివేతకు చర్యలు

- పోలీసుల సహకారంతో రైతుబజారు నుంచి బయటికి పంపిన ఎస్టేటు అధికారి కళ్యాణి
- రైతులకు కొత్తగా గుర్తింపు కార్డులు ఇస్తామని వెల్లడి



రైతుబజారులో దళారులను ఖాళీ చేయించి రైతుకు స్థానం కల్పించిన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సీ.క్యాంపు రైతుబజారులో దళారుల ఏరివేతకు అధికారులు చర్యలు చేపట్టారు. మూడవ పట్టణ సీఐ శేషయ్య ప్రత్యేక బందోబస్తుగా ఆరుగురు పోలీసులను రైతుబజారుకు పంపారు. ఎస్టేటు అధికారి కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్, సెక్యూరిటీ సిబ్బంది దళారులను బయటికి పంపి వారి స్థానాల్లో రైతులను కూర్చోబెట్టారు. సీ.క్యాంపు రైతుబజారులో దళారులు తిష్ట వేసిన వ్యవహారంపై గత నెల 27న 'సాక్షి' దినపత్రికలో 'రైతుబజారులో దళారులదే రాజ్యం' శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. దీనిపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ సునీత తీవ్రంగా స్పందిస్తూ.. దళారులను విధిగా ఏరివేయాలని ఆదేశాలు ఇచ్చారు. దళారులను రైతుబజారును నుంచి బయటికి పంపించేందుకు ఎస్టేటు ఆఫీసర్ మూడవ పట్టణ సీఐతో రైతుబజారులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దళారులకు హెచ్చరికలు చేశారు. పోలీసుల నుంచి సహకారం లభించడంతో ఏరివేతకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం అనేక మందిని బయటికి పంపించారు. రైతుబజారులో రైతులకే స్థానం ఉండే విధంగా కొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్ణయించారు. హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించిన తర్వాతనే గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని ఎస్టేటు అధికారి కళ్యాణి తెలిపారు. గుర్తింపు కార్డులు ఉన్న వారినే రైతుబజారులోకి అనుమతిస్తామని వెల్లడించారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఇన్సాఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని ఇన్సాఫ్ జిల్లా నాయకుడు రాజాసాహెబ్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఇన్సాఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తుల్లో బీజేపీ పెత్తనం కోసమే ఈ బిల్లును తెచ్చారన్నారు. దేశంలో అన్ని మతాలను సమానంగా చూడాల్సిన ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై వివక్ష చూపుతోందన్నారు. దేశవ్యాప్తంగా 8.70 లక్షల ఎకరాల ఆస్తి ముస్లిం సంస్థలకు ఉన్నాయని, వాటిని కాజేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. సవరణల పేరుతో వక్ఫ్ ఆస్తుల జోలికి వస్తే కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహ్మద్, డి.శ్రీనివాసరావు, రసూల్, సయ్యద్ షరీఫ్, మున్ని, ఆశాబేగం, సోషియా, గౌస్, మున్నీర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు చెక్‌లను అందజేస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్

కర్నూలు కల్చరల్: ఎన్‌సీసీ, చదువులో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్‌లను అందజేశారు. ఉపకార వేతనాలకు ఎంపికైన మాంటిస్సోరి పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ రుక్మానంద, మనోహర్‌బాబు, సిల్వర్ జూబ్లీ కళాశాల క్యాడెట్ తేజ, సెయింట్ జోసఫ్ కళాశాల క్యాడెట్ సలీంకు సోమవారం 28 (ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ పరిపాలనా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్ ఒక్కొక్కరికి రూ.6 వేల స్కాలర్‌షిప్ చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులో, ఎన్‌సీసీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆయా పాఠశాలలు, కళాశాలల ఎన్‌సీసీ అధికారులు భక్తూరు బాబా, రాఘురాం, బంగారు బాబు, ఎన్‌సీసీ కార్యాలయ పర్యవేక్షకులు జయపాల్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి



డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇస్తున్న యూజేఎఫ్ నాయకులు

కర్నూలు (సెంట్రల్): దేవనకొండ మండలంలో మట్టి మాఫియా అరాచకాలపై వార్తలు రాసిన విలేకరిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం యూజేఎఫ్ ఆధ్వర్యంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టి అక్రమ తరలింపుపై ఫొటోలు తీస్తున్న విలేకరి భీమలింగడుపై కన్నప్ప, ఉరుకుంద అనే వ్యక్తులు ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. అలాగే సెల్‌ఫోన్, ఉంగరాన్ని లాక్కున్నారని, వారిపై కేసు నమోదు చేయాలని దేవనకొండ సీఐను కోరితే పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ నాయకులు, యూజేఎఫ్ నాయకులు సత్యనారాయణ, చిన్నరామాంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

ప్రగతి పనులను వేగవంతం చేయండి



నగర అభివృద్ధిపై సమీక్షిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): నగరంలో ప్రగతి పనులను వేగవంతం చేయాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్ని విభాగాల అధికారులతో నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రాజ్‌విహార్ సమీపంలో హంద్రీ ఒడ్డున బండ్ రోడ్డు, మెడికల్ కళాశాల వద్ద మలుపు విస్తరణ, ఏపీఎస్పీ వద్ద బైపాస్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పాతబస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్ ప్రాంతాల్లో తోపుడు బండ్లను తొలగించాలని ఆదేశించారు. స్పీడ్ బ్రేకర్లను వాహనదారులు గుర్తించేలా రంగులు వేయాలని సూచించారు. తాగునీటి సరఫరాను పగటి పూట చేయాలన్నారు. మంత్రి మాట్లాడుతూ.. నగరంలో ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగన్న కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఎమ్మిగనూరు – మంత్రాలయం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల కాపరి లింగన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, గౌరవాధ్యక్షుడు కిష్టన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ.. పేదరికంలో గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న లింగన్న మృతితో ఆయన కుటుంబం రోడ్డున పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అలాగే గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలన్నారు. కోశాధికారి కేసీ నాగన్న, నాయకులు బీసీ తిరుపాలు పాల్గొన్నారు.

ఆశాలకు యూనిఫాం అందజేత



ఆశాలకు యూనిఫాం అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పనిచేసే ఆశాలకు సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ తన ఛాంబర్‌లో యూనిఫాంలను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశాలు క్షేత్ర స్థాయిలో, హాస్పిటల్స్‌లకు గర్భిణులను, రోగులను తీసుకెళ్లినప్పుడు తప్పకుండా యూనిఫాం ధరించాలన్నారు. అలాగే ఈ–ఆశా యాప్‌లో ప్రతిరోజూ లాగిన్ అవుతూ అందులోని అర్హులైన జంట, ఐఎఫ్ఏ, విటమిన్–ఎ, హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ, వీహెచ్ఎస్ఎన్‌సీ, ఆప్షన్‌లో డేటా సబ్‌మిట్ చేయాలన్నారు. ముఖ్యంగా ఆశాలు తమ పరిధిలోని అన్ని గృహాలను సందర్శించి గర్భిణులు, బాలింతలకు అన్ని సేవలందించాలని సూచించారు. డెమో శ్రీనివాసులుశెట్టి, హెచ్‌ఈ పద్మావతి, డీపీహెచ్ఎన్ఓ అన్నపూర్ణ, కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

చాకలి మాన్యాలను రజకులకు అప్పగించాలి

కర్నూలు (అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లోని చాకలి మాన్యాల భూములను సాగు చేసుకునేందుకు రజకులకే అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ రజక ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేంపెంట రాంబాబు కోరారు. పూర్వకాలంలో ఆయా గ్రామాల్లో జరిగే ఉత్సవాలు, దేవరలు, జాతర్లలో దివిటీలను పట్టడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో రజకులు పాలుపంచుకోవడం వల్ల వీరికి కొన్ని భూములను చాకలి మాన్యాలుగా కేటాయించారన్నారు. అయితే పలు గ్రామాల్లోని పెత్తందార్లు చాకలి మాన్యాలను వారిపేరిట పాస్‌బుక్కులు, ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని రజకులకు హక్కులు లేకుండా చేశారని ఆయన సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చాకలి మాన్యాలను గుర్తించి వాటికి పాస్‌బుక్కులు ఇప్పించాలన్నారు. అలాగే పలు గ్రామాల్లోని దోబీఘాట్ల స్థలాలకు మార్కెట్ రేటు పెరగడం వాటిని ఆక్రమించుకున్నారని తెలిపారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి రజకులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రజల సహకారం అభినందనీయం

కర్నూలు (టౌన్): నగర అభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లిస్తూ ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లలో గణనీయ పురోగతి సాధించిన సందర్భంగా సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ మందిరంలో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్, అమినిటీస్ కార్యదర్శులతో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేనంతగా ఆస్తి పన్ను 75.78 శాతం, తాగునీటి కొళాయి చార్జీలు 38.99 శాతం వసూలు చేయడం శుభపరిణామమన్నారు. పన్ను వసూళ్లలో ప్రతిభ కనపరచిన సచివాలయ ఉద్యోగులను కమిషనర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

చోరీ కేసు నిందితుల అరెస్టు

కర్నూలు (అగ్రికల్చర్): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని కర్నూలు మూడో పట్టణ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గంజి ప్రసాద్, జగన్ కర్నూలు నగరంలో తాళం వేసిన ఇళ్లను గుర్తించి పలు చోరీలకు పాల్పడ్డారు. దొంగతనాలపై పోలీసులకు పలు ఫిర్యాదులు అందాయి. ఎట్టకేలకు మూడో పట్టణ సీఐ శేషయ్య నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 6 ఉంగరాలు, మూడు సంచుల బియ్యం, ఒక టీవీ స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి మరిన్ని వస్తువులు రికవరీ చేసుకోవాల్సి ఉంది.

14న అయ్యప్ప విషు మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈనెల 14వ తేదీన శ్రీ అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం పురస్కరించుకొని విషు మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి పడిపూజ, భజన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	2727	6499
పొద్దుతిరుగుడు	4769	5369
ఆముదం	5291	6039
వాము	800	22228
ఉల్లి	500	1469
ఎండుమిర్చి	8500	9999
శనగలు	3009	5718
కందులు	2100	7209
మొక్కజొన్న	1569	2173
మినుములు	4100	7329
కొర్రలు	1016	2629
సోయాచిక్కుడు	1839	3479
సజ్జలు	2400	2400

ఫోన్: 08518-257204, 257661

ఘనంగా ఆరోగ్య దినోత్సవం



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.లీలావెంకట శేషాద్రి



మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు తమకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం బలవర్ధక ఆహారం తీసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఎస్ఎస్ఎస్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో న్యూలెక్చరర్ గ్యాలరీలో కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, డాక్టర్ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో మెరిడియన్ యూపీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. సెట్కూరు సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ.. మాతాశిశు ఆరోగ్యం, కిశోర బాలికల్లో పోషకాహార లోపం, బాల్యవివాహాలు, టీనేజీ గర్భం దుష్ప్రభావాల గురించి వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెమో శ్రీనివాసులు శెట్టి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ బి.లీలావెంకటశేషాద్రి మాట్లాడుతూ.. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని, రోజూ నడక, యోగా చేయాలని సూచించారు. లయన్స్ క్లబ్ సభ్యులు రాయపాటి శ్రీనివాస్, సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెరుగు విజయ్‌వర్ధన్ రెడ్డి

ఘనంగా వరల్డ్ హెల్త్ డే

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని సోమవారం గీతాంజలి గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్స్ వారు నగర శివారులోని కిమ్స్ నర్సింగ్ కళాశాల, గీతాంజలి నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అపోలో హాస్పిటల్ (హైదరాబాద్) రేడియాలజిస్టు డాక్టర్ విజయ్, జనరల్ సర్జన్ డాక్టర్ మల్లీశ్వరి, కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి ప్రసంగించారు. వరల్డ్ హెల్త్ డే ప్రాముఖ్యతను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నర్సింగ్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన మోడల్స్‌ను పరిశీలించి మార్కులు వేశారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు వసంతకుమారి, అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, అధికారులు, ఉద్యోగులు

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి



అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతులు అందజేస్తున్న స్థానిక వాసులు

కర్నూలు (టౌన్): ఎంఎస్ విల్లాస్‌లో డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలని స్థానికులు శివప్రసాద్, ఉదయ్ కిరణ్ వినతిపత్రం సమర్పించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులను నమోదు చేసుకుని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు క్రిష్టఫర్, స్వర్ణలత, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- రాజీవ్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని 42వ వార్డుకు చెందిన సుబ్బయ్య, సుబ్బమ్మ అభ్యర్థించారు.కృష్ణా నగర్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని స్థానికులు అశోక్ ఆచారి, సురేష్ కుమార్, సాయికిరణ్ విన్నవించారు.
- కేసీ కెనాల్‌ను శుభ్రపరచి చెత్తా, చెదారం లేకుండా చూడాలని సోషలిస్ట్ యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా ఇన్‌చార్జి హరీష్ కుమార్‌రెడ్డి కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కూలీలకు పనులు దొరక్క ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు కనీస గిట్టుబాటు చట్టాన్ని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, కరువు ఉన్నా రైతులను ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిర్చి రైతులకు కనీస మద్దతు ధర లేకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు చెప్పారు. నాయకులు వెంకటస్వామి, రాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎఫ్‌డీపీని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్‌యూ రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు

కర్నూలు కల్చరల్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ సూచించారు. ఆర్‌యూ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆన్ ఏఐ – బోధన, అభ్యసనాలకు ఆచారణాత్మక విధానం' అనే అంశంపై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఆర్‌యూ, కర్నూలు ఐఐటీడీఎం, వరంగల్ నిట్ సంయుక్త నిర్వహణలో భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఎఫ్‌డీపీకి నమోదు చేసుకున్న అధ్యాపకులందరూ ఆరు రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందిరా గాంధీ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆచార్యులు ఎస్.రామనారాయణరెడ్డి కీలకోపన్యాసం చేశారు. వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి మాట్లాడారు. ప్రొఫెసర్లు సి.విశ్వనాథరెడ్డి, నోయల్ అనురాగ్ ప్రోగ్రామ్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వివిధ వర్సిటీలు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు

వ్యాస పూజ

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో మంగళవారం వ్యాస పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నరసింహ యజ్ఞం, ప్రవచనం, హారతి, గురు పూజ, హరినామ కీర్తనలు ఉంటాయని పేర్కొన్నారు.